# పంట

నవంబర్ మాసం మధ్యరోజులు ! రెబ్బకొండ గాలి గుండెలు వొడికించేస్తుంది చలితో ! దట్టంగా పడుతున్న తెల్లమంచు—కొండల్నీ, ఆకాశాన్నీ కప్పేసింది. గ్రామాలనూ వాటి చుట్టూ ఉన్న పొలాలను కలిపేసింది తెల్లగా !

మంచుతో తడిసిన చెట్లు....బాధతో కళ్ళనుండి నీరు కార్చినట్లు ఆకుల నుండి నీటి బొట్లు టపా టపా రాల్చుతున్నాయి ! చిన్న చిన్న మొక్కలయితే భోరుమని విలపిస్తున్నట్లు జలజలా రాల్చుతున్నాయి మంచుబిందువులను.

రెబ్బకొండ వెనకగా పుడమితల్లి పురిటి నొప్పుల్లోవుంది. రక్తకాంతి ఎర్రగా సింధూరంలా వుంది. కాంతిని ఆవాహనం చేస్తూ కోడిపుంజులు గొంతులెత్తి అరుణోదయాన్ని చాటుతున్నాయి !

పార్వతీపురం ఏజన్సీలో—తూర్పుకొండల కానుకొనివున్న ఆ అడవులలో రకరకాల పక్షులు అరుచుకుంటూ....రెక్కలు కొట్టుకుంటూ చెట్లమీంచి ఎక్కడికో పయనమయ్యాయి.

ఆ అడవుల కిందవున్న వలసల వరకూ పరుచుకొని వున్న పంట పొలాల్లో....పంటకొచ్చిన వరిచేలు మంచుతో తలలు బరువుగా వేలాడేసి ....చలికి సన్నగా వొణుకుతున్నాయి.

వలసల వీధుల్లో చలిమంటలు కాల్తున్నాయి. మంటల్లో కాల్తున్న పచ్చిదుక్కలు మసిమారుతూ పొగరేపు తున్నాయి. చలికాగుతున్న గిరిజనులు కళ్ళు పులుముకుంటూ, ఒళ్ళు విరుచుకుంటూ చలిమంట నుండి పనిపాట్లలోకి కదులుతున్నారు.

చేతిలోని మునకాలకర్రతో ఎవరో....తనపక్క కొచ్చి మంటకాగు తున్న కుక్కనుకొట్టాడు ! కుక్క తోకముడుచుకుంటూ....కుయ్యోఁ....మని రాగాలుతీస్తూ పారిపోతోంది !

కొండలమీంచి మంచు మెల్ల మెల్లగా కరుగుతోంది. పోడులమీద డబ్బాలు....కొండల్లో ప్రతిధ్వనిస్తున్నాయి....అక్కడెక్కడో కొన్ని గొంతులు 'నక్క'ను తరుముతున్నాయి. చీకట్లను తరిమేస్తూ....సూరీడు కొండలమీంచి బయట పడుతున్న వేళవుతోంది....

కొండగొర్రి బిక్కం....యింటి ముందటి రాటకి కట్టిన మేకకి వేప కొమ్మలు దొంత జేసి, రాటకు వేలాడేసి....ఆ కొమ్మలలోంచి, ఒక పొడవాటి పుల్లను పళ్ళు తోముకోటానికి విరిచాడు.

బిక్కం 'జుంబిరి' గ్రామస్థుడు. ఉంగరాలు తిరిగిన చింపిరిజుత్తు: వెడల్పాటి మొహానికి లోతుకళ్ళు: మూతినిండా గుబురు మీసాలు....చూట్టానికి మనిషి యేదో యాతనలో వున్నట్లు కన్పిస్తాడు. ఒంటిమీది గోచీగుడ్డ బాగా మాసిపోయింది. పాదం నుండి తలదాకా వొత్తుగావున్న వెంట్రుకల్తోటి శరీరం నల్లగా కనిపిస్తోంది. నల్లటి శరీరంలోని కండలు యిపుడిపుడే బిగువు సడల్తున్నాయి.

బిగువు సడలుతున్న బిక్కంకి వయసు నలభయి దాటి వుంటుంది. పనిపాటుల్లో సాయపడే భార్య ఎప్పుడూ వెంట వుంటుంది. కొడుకు —పోడంతా కాపలాకాసి తిరుగుతుంటే, వెంటగా యీ రాటనున్న మేక తిరుగుతుంటుంది. ఇంటివద్ద కూతురు కోళ్ళు చూసుకుంటూ వంటా వార్పూ చూస్తూవుంటుంది.

రాటనున్న మేక 'మే !' అని గీపెట్టి, వేపఆకులు నమలసాగింది. బిక్కుం పళ్లదోము పుల్ల నోట్లో పెట్టాడు. ఇంతలో పక్కింటి సోంవు ఆతృతగా వస్తూ —

"బిక్కుం ! గెడ్డోర నీ వారిసేని కోసేత్తన్నారు రా... బుగత బాబు మనుసులు" అన్నాడు

"ఆఁ !" అని ఆశ్చర్యపోయాడు బిక్కుం ! సోంవు మాటలు విన్న బిక్కుం భార్య యింట్లోంచి వచ్చి, చేత్తో మెటికలిరిస్తూ

"అయితే, యింకొదల్లేదన్నమాట మామీద పడ్డపీడలు ! ఓలమ్మ ....యెంత అంతకంకి దిగిపోనారు ! ఆడెంత బుగత బాబయితే మట్టుగ; నాయెం ధరమ్మొందొద్దా ! ఆడేటి ఉడిసి అలిసిపోనాడా ? గాబు దీస్సి జాపోసి పోనాడా ? సెంవట పోసినాడా ? ? ?.... సేని కోసేడంకి పూను కున్నాడు ! ఆ కరనం గండడెన్ని గండాలు పెట్టాడు ! కొండల్లాగున్ని, గెడ్డగట్టు తవ్వి....బాగుసేత్తే; యింత మడిసెక్క గట్టుకుంతే—గండలు ! నా మడిసెక్కని ఆల గుండంల కలుపుకుంతారా ? నాకట్టం గంగల కలిపీస్తారా ?" యిలాగ రాగాలు తీస్తూ అప్పుడే ఉదయిస్తున్న సూర్యున్ని చూస్తూ —

"నాయినా, సూర్నారాయనమూర్తి ! సూత్తన్నావుగాదా—అన్నేయం ! ఆ అన్నేయ పోలి మీద అగ్గి కురిపించవా ? ఆలబతుకులంటించేవా ?" అని ప్రార్థించసాగింది !

గెడ్డోరగట్టు తుప్పలూ, డొంకల్లో రెల్లిగడ్డీ, దబ్బగడ్డీ నిండి పోయుంటె దాన్నివరకట్టి; మొజ్జులు ఎక్కలాగి-మెరకదున్ని, గట్లుబోసి ఒక మడిని వరకట్టుకున్నాడు బిక్కుం అయిదేళ్ళ కిందట ! రెక్కలిరిసి సాగులోకి తెచ్చుకున్న ఆ మడిలో మొదటి సంవత్సరం వరిపంట పండిం చాడు. పోడుపంటలకు తోడుగా జొరిపొలంల వున్న మడిలో పంటకు తోడుగా—యీ గెడ్డోర మడి పంట కలవటంతో బిక్కుంకి ఆ యేడాది

తిండికి లోటురాలేదు. పిల్లాది మొదటి కుటుంబ మంతా కడుపునిండా తిన్నారు. కష్టం ఫలించింది అనుకున్నారు !

కడుపుమీద దెబ్బగొట్టాడు కర్నం ! గెడ్డ గవర్నమెంటుదన్నాడు. రెవిన్యూ భూమి ఎంక్రోచ్ చేయటం నేరమన్నాడు. దానికి ఘోరమైన శిక్షన్నాడు. జరీమానన్నాడు. పాపం ! బిక్కుం బిక్కమొహం వేశాడు. దిక్కులు వెదికాడు. దేవతల్నీ, దయ్యాల్నీ మొక్కాడు ! వాటితోపాటుగా ....కర్నం కాళ్ళుపట్టుకున్నాడు.

"బాబ్బాబు ! నాకడుపు కొట్టకు ! నా పెళ్ళాం, పిల్లాది మొదలు రెక్కలిరిసి కట్టుకున్న మడిసెక్క. యిన్ని గింజలు పండితే గెంజితాగుతా మని ఆశపడ్డాము. మా గెంజిల బుగ్గి పోసీకు" అని పలురకాలుగా బ్రతిమాలగా కర్నం ఆయేడాదికి కనికరించాడు ! కనికరించినందుకు.... ఆయేటిపంటలో పాలుయిచ్చుకున్నాడు బిక్కుం ! కర్నంకిచ్చిన పాలుపోగా పంటకు పెట్టిన మదుపుపోగా ఆ యేడాదికి బిక్కుంకి మిగిలినది కొండు గడ్డీ....కొద్దిపాటిగింజలూ ! అయినా అదేచాలు అనుకున్నాడు బిక్కుం.

కరణం దీనితో సరిపెట్టుకోలేదు. సరిపెట్టు కోవాలనుకున్నా సరిపెట్టుకోనివ్వలేదుబుగతబాబు ! బుగతబాబుకి గెడ్డ దిగువను,ఎగువచుట్టు పక్కలా, అక్కడింది పల్లందాకా దాదాపు రెండొందలెకరాల భూమివుంది. బుగతబాబుకి సమితి ప్రెసిడెంటుతోటి చనువుంది. జిల్లాపరిషత్ చైర్మన్ తోటి స్నేహముంది....రాష్ట్ర మంత్రివర్గంతో మంచి పరిచయముంది.

ఇంతభూమినీ కొంతకౌలుకిచ్చేసి కొంతకంబార్లను పెట్టి సాగు చేయించు కొస్తున్నాడు. యిదిగాక రోడ్లూ, చిన్నగెడ్డలకు వంతెనలూ, డాంలూ లాంటి కట్టడంపనుల కొంటాాక్టులన్నీ బుగతబాబే గుమస్తాల ద్వారా చూసుకొస్తున్నాడు.

ఇలా... రైతుల్లో మోతుబరి రైతులాగ, కంట్రాక్టర్లలో బడా కంట్రాక్టర్ లాగ రాజకీయ నాయకుల్లో ... పదవీ

వ్యామోహం లేని పెద్దలాగ; అప్తుడులాగ... అప్రాంతంలో పేరుప్రతిష్టలు కలిగిన బుగతబాబుకి ... గెడ్డోర తన భూముల పక్క బిక్కంగాడు వరకట్టిన మడిచెక్క భోగట్టా తెలిసింది.

"వరకట్టినందు కాడు మూడేళ్ళ పంట ననుభవించాడుకదా; యిక దాన్ని లాగేయ్" అని కర్నంకి చెప్పాడు బాబు !

కర్నం కాదనలేకపోయాడు లాగేసాడు మడిచెక్కని!

"యిదేటి గోరం ! నీకేటేటా పాలూ భాగం యిచ్చుకుంతన్నాను. పట్టా తెప్పిత్తాననోడివి....ఆకరికి కట్టుకున్న మడిసెక్కని సెల్లుజేసీ త్తన్నా వేటి బాబో....కర్నంబాబో" అని గొల్లుమన్న బిక్కంకి—కర్నంచిట్టా లిప్పాడు చట్టాలు చెప్పాడు. అడంగలన్నాడు. అదన్నాడు....ఇదన్నాడు యీగెడ్డ బుగతబాబు వంశానిదన్నాడు. గెడ్డ ఆయకట్టు వారి జిరాయితీ అన్నాడు. గెడ్డ:- గెడ్డగట్టూ వారిదే అన్నాడు. గవర్మెంటుగాదు కళ్ళు మూసుకోడంకీ, కానకపోడంకీ ! బుగతబాబుకి బోల్డు సూపుంది ! అతని కళ్లకాననిది లేదు. అంచేత కొండోడా, బుగతబాబు భూమినొదిలీ.... లేప్పోతే....నీకుభూమ్మీద నూకలుండవు అనిగూడా అన్నాడు !

వొదల్లేదు బిక్కం ! ఒదిలేయటానికి ఆమడిలో బెడ్డలన్నీబిక్కం కుటుంబం తాలూకా నెత్తురుగడ్డలు ! నెత్తురు నెలా మర్చిపోగలడు? ఒంటి నెత్తురు ప్రవాహం ఆగేదాకా నెత్తురు మీద ఆశ వుంటానే వుంటది.

ఆశల్ని మోసుకు బుగతబాబుని దర్శించుకున్నా డోసారి బిక్కం.

"నాయిం కాదు, నారత్త మాంసాల్ని గెడ్డలపోసి మడిసెక్క జేసాను ! నాకడుపు కొట్టకు ! కనికరించుబాబూ" అని కాల్లుపట్టుకున్నాడు! కన్నీటితో సొదంతా వివరించాడు !

బాబు "నా జిరాయితి జాగాల నా కళ్ళు గప్పిసి మడిగట్టుకోని;... మూడేళ్ళ అనుభవించింది చాలక యింకెవుడి ఆస్తి పడీసుకుంతావురా ? పోన్లేకదా అని ఒదిలేస్తున్నాను కాకపోతే కేసుబెట్టి జైళ్ళ దోయించి త్తే...

నీ నులుపూ, నలుపూ తీరిపోయున్ను. యెల్లెల్లారే కొండోడా... ఎల్లు" అని గసిరి తగిలేసాడు !

బాధతోనూ, కోపంతోనూ, ఆవేశంతోనూ బుగతబాబు వేడదిగుతూ మెట్లమీద నిలబడి - మూడేళ్ళ పంట అకటనపోడు మూటగట్టుకున్నాడు. నువ్వేకం నేలతల్లినే సుట్టేసుకుంటన్నావు ! కట్టుకోండి ... కట్టుకోండి.... గానిది అగ్గిమూట ! ఆఁ ! అగ్గిమూట అని మాత్రం కానుకోండి - అని హెచ్చరించి వచ్చేసాడు... బిక్కం !

ఆతర్వాత ఎండలో...నీడనిచ్చే చెట్టులాగా, వానలో గొడుగులాగా చీకటికో దీపంలాగా బిక్కంని గిరిజన సంఘం ఆదుకొంది. సంఘం బాధ్యులు విషయాన్నంతా విన్నారు. బిక్కం బాగుజేసిన మడిచెక్క చూశారు. సమస్యను—పల్లంలో, బుగతబాబు గ్రామంలో, సమావేశం జరిపి, పరిష్కరించే కృషిచేసారు. బుగతబాబునీ ఊరి ప్రజలనూ కూచో బెట్టి....చర్చించి, అందరి అభిప్రాయం విన్నాక సంఘం వారు: - బిక్కం గట్టిన మడిచెక్కను బుగతబాబు తీసుకోడం న్యాయం కాదన్నారు ! అక్రమమన్నారు ! బిక్కం మడిని ఒదిలేసి యీ అక్రమాన్ని సరిదిద్దు కోమని చెప్పారు ! లేన్నాడు మంచిది కాదనీ అన్నారు !

అదే ఆమాటే బుగత బాబుకి నచ్చలే ! ఆ పంచాయితీ తీరూ నచ్చలేదు ! యేమంటే. బుగతబాబుకేమీ ? రాజ పోషకులు ! ఆయన తల్చుకుంటే రాజుని బికారిగానూ, బికారిని రాజుగానూ చేసీగల్డు ! అంతటి పవర్‌ఫుల్ బాబుని బేడాపరగ్గాడిలాగా వీధిలోకి పిల్చి తగువు బెట్టడం నచ్చలే ! అంతకుముందు ఆ కొండోడు - "కట్టుకోండి...కట్టుకోండి ! కానిది అగ్గిమూటని కానుకోండి" - అని అనడమూ నచ్చలేదు. దాన్తర్వాత యీ సంగపోలొచ్చి సభజేసి మొత్తం తన గురించి తనవంశపారంపర్యం గురించి చరిత్ర చెప్పటమూ నచ్చలేదు సంగపోలన్న మాటలిలాటివి ! బుగతకెలాగ నచ్చుతాయి ?

— గెద్ద సిరాయితీ కావట బిక్కుంగాడు కట్టిన మడిచెక్క... యే లెక్కన సిరా బుగతబాబు భూమిలోది కాదట ! రెవిన్యూ అధికారుల్ని మంచి చేసుకొని, కొండోళ్ళ అమాయకత్వాన్ని ఆసరా తీసుకొని....తన లాంటోల్లు గిరిజన్ల భూములు గుంజుకుంతన్నారట ! అసలు ఏజన్సీ భూములు గిరిజనులకే వుండాలి తప్పా గిరిజనులు కానోలికి వుండగూడదని చట్టాలున్నాయట ! యిలాగెన్నో చెప్పి చట్టాలని చెత్తబుట్టల జల్లేసి .... తనలాంటి బుగతలు జబర్దస్తీ జేస్తన్నారనీ...జరుగుబాటు లేని పేద లంతా యీ జబర్దస్తీ మీద తిరుగుబాటు చేస్తారు జాగ్రత్తనీ బెదిరించారు !

యిలా బెదిరించితే బాబుకి బియ్యమేటి ? కాకీతోటి కవురెడితే కలకటేరొస్తాడు, గెద్దతోటి కవురెడితే కాకీబట్టలోల్లొస్తారు ! మిట్టకాయేత్తే ...మినిష్టర్లొస్తారు ! ఆబాబుకి బియ్యమేటి ? - అని ఆగ్రామ పెద్దరైతులు కొంతమంది అనుకున్నారు.

వారనుకున్నట్టే బుగతబాబు కసిగండలేదు ! సంగపోలిమాట కాతరు సెయ్యలేదు ! - ఎల్లుండెల్లుండి...ఆ కొండోడి అగ్గిమూటనీ,... మీ తిరుగుబాటునీ చూసుకోగల్ను ! ఎల్లుండి - అని తెంపేసి, తగువు లోంచి లేచిపోయారు బుగతబాబు !

అలాగే చూసుకున్నారు కూడా బుగతబాబు ! సంగం దన్నువుంది కదా అని మడిచెక్కమన్ని...నారుపోసాడు ఆరుద్రకార్తెల బిక్కుం! బుగతబాబు...చూసాడు ! ఊరుకున్నాడు ! నారు బాగా పెరగనిచ్చాడు ! యిక వుడుపుకి నారు అందుకొచ్చే టయిముల ఆ మడి దమ్ము పట్టించాడు ఉభాల సీజనులో బుగతబాబు ! అడ్డుకున్న బిక్కుంనీ; అయిదారుగురు గ్రామస్తులనీ పోలీసులు లాక్కుపోయారు ! బాబు పోయించిన సారా ప్రభావంతో సుత్తెక్కిన పోలీసు లాఠీలు పిచ్చెత్తిపోయాయి ! బిక్కుంకీ, మిగతా వారికీ ఒళ్ళు పచ్చిపుళ్ళయిపోయాయి.

మర్నాడు 'గిరిజన సంగం' బాధ్యుల ప్రయత్నంతో, జామీను మీద విడుదలయ్యారు.... బిక్కం, తదితరులా ! ఆరోజే సంగం మొత్తం కదలి, ఊరు మొత్తాన్ని కదిపి.... దమ్ముపట్టిన మడిలో నారుతీసి ఉడిపించారు. చిక్కగా నాట్లుపడ్డాయి ! బిక్కం మనసు కుదుట పడింది !

అదిగో అలా కుదుటపడ్డ మనసుతోటి, ఆ మడి చెక్కలో చెమట కాలువజేసి పెంచిన వరిచేను కోతకొచ్చింది !

చేను కోతకొచ్చేదాక.... ఊరుకోని, యిప్పుడన్యాయానికి దిగిపోయినాడు బుగత ! బిక్కంకి సోము తెచ్చిన కబురు చావు కబురయ్యింది !

ఆందోళనతో, బాధతో "యిప్పుడెలాగ? ఆలెంతమంది ఉంతారో?" అడిగాడు బిక్కం !

"ఉంతారు.... పాతికి మందిదాకా...." సోము !

"పోలీసుల అలికిడుందేటి....?" బిక్కం !

"అలికిడి లేనట్టు గుందిగాని.... కర్నపోడొచ్చాడు ! గట్టుమీద కేకలేసుకు తిరుగుతండు...." సోము !

"యేల యీ ఆరాలన్నీ ? ఎక్కడోలో, యిక్కడ మనముంగాల పంట కోసీడంకి అంతగుండె నిబ్బరం గెలిపొచ్చేరు. ఆలకి నేదు బియ్యం ! నీ రత్తం పోసిన మడిని, నువు పెంచిన పంటని ఆలకి జడిసి వొదిలేత్తావేటి? నువ్వొదిల్నా.... నానొదల్ను ! పద.... పద.... ఆలో, మనమో ? తేలిపోవాల ?" అని ఆవేశంగా యింట్లోంచి రెండు కొంటు కర్రలు తెచ్చి, భర్త కొకటిచ్చి తనొకటి పట్టుకు బయల్దేరింది బిక్కం భార్య !

సోము వాళ్లని ఆపుతూ "ఆగండాగండి ! యిలగ్గాదు. అంతకు మునుపిలాగే దమ్ముబట్టి నపుడు మనమడ్డితే.... ఆ బుగతబాబు మనుసులు మన్నిగొట్టారు.... పోలీసోల్లు మన్నిపట్టుకు పోనారు" అన్నాడు.

"అయితేటి, చేతికందిన పంటని ఆ దర్యాతకి దారబోసేమంటా వేటి దద్దా ?" అని ప్రశ్నించింది బిక్కాం భార్య !

"అదిగాదే కూతురా ! మనమిపుడు దేన్నీ వొదిలేము. సంగమున్నది.... సంగం నిలబెట్టిన దేవుడు గురువున్నాడు... ఆలికి చెప్పి చేద్దాం" అన్నాడు సోంవు !

"యిక్కడ్నుండి పంట దాటిపోతే, ఆ తర్వాత యేటి జేత్తేటి నాబం ? నా ఒంటిల పేనముండగా.... పంట ఆ దర్యాతల పాలబడనీను" అని మరి నిలబడకుండా, కొంటి కర్రెత్తి పరుగందుకున్నాడు బిక్కాం ! అతని వెనకాలే భార్య... కొంటి కర్రతో పరుగందుకుంది !

*　　　*　　　*

"ఎవుడావోరే... నా సేనికోసినోలి పీకలు గోసిత్తా నివ్వోల... కాసుకొండావోరే'' అని ప్రళయంగా కేకేస్తూ మడిగట్టు చేరాడు బిక్కాం !

గట్టుమీద కర్నం తిరుపతిరావు పట్నాయక్ వున్నాడు. కర్నం నౌకరీ చూసుకోవడమేగాక, అంతకన్నా బిగతబాబు వ్యవహారాలే ఎక్కువగా చూస్తావుంటాడు. పులెనకాల వరదు లాగ - బాబెనకాల కరణం బతుకొస్తున్నాడు. అందేక బాబు బంగారం సంపాదిస్తే కరణం కాసులు సంపాయించుకుంటున్నాడు. బాబు వెనకాల కర్నం... ఎవరి బతుకయినా తీయడానికి వెనుకాడడు !

వెనుకాడని కర్నానికి గట్టుమీన వెనుక నుండి బిక్కాం వేసిన పొలికేక వినబడింది ! చూస్తే... కొంటి కర్రెత్తి పరుగెత్తుకొస్తూన్న బిక్కాం కనబడ్డాడు ! వెంటనే కర్నం ఆతృతగా—

"ఒరె కోతాకీసి... గట్టుమీన కర్రలు తియ్యండ్రా ! ఆ కొండోడొత్తండు...రండ్రారె...'' అని కోతకి తెచ్చిన మనుషుల్ని సిద్ధం చేశాడు.

కోత ఆపేసి... అందరూ కర్రలందుకున్నారు ! బిక్కాం రాగానే

కొంటి కర్ర కర్నం బుర్రమీద వేయబోయాడు ! కోత కూలీల కర్రలడ్డీ సాయిదాన్ని ! కర్ర.... కర్రలూ కలిసాయి ! బిక్కుం భార్యా కలిసింది ! దెబ్బలు... కేకలు ! బిక్కుం తలమీద దెబ్బ ! నెత్తురు చిమ్మింది ! ఎర్రగా రక్తం పంట గట్టుమీద పడింది !

యింతలో గెడ్డ నలుమూలల నుండీ కేకలు... ఈలలు ! కొట్టో... కొట్టో ! అని కేకలు విన్పించాయి.

కర్నం కంగారుగా అన్ని వైపులా దృష్టి సారించాడు నలువక్కల నుండి... కర్రు, కంపా, గొడ్డలీ, కత్తీ పట్టుకొని వలసలోని ఆడా, మగ పిల్లాది చేరిపోయారు ! దొరికి నోల్లని దొరికినట్లుగా చితుకబొడిసారు.

కూలి కొచ్చిన గూండాలు కర్రలు పారేసి పరుగందు కున్నారు ! పారిపోయారు ! కర్నం కంగారెత్తిపోయి, గుండెలు దడదడ లాడగా— ఓర్నాయిన, సచ్చాంరో అని పారిపోబోయాడు ! పరుగెత్తే కర్నం కాళ్ళ మధ్య బిక్కుం భార్య కొంటికర్ర అడ్డమేసింది. దబ్బున గట్టుమీద పడిపోయాడు కర్నం. పడిపోయిన కర్నం బుర్రమీద బిక్కుం ఎత్తిన కొంటికర్ర పడబోతుంటే సోంవు ఆపేసాడు !

ఆపేసి—

"వొద్దు... కొట్టొద్దు పదండి, యీడ్ని గురువు దగ్గరికి తీసుకెల్లి... గురువేటి సెయ్యమంతాడో... అది సేద్దం" అని చెప్పి... అందర్నీ గురువు దగ్గరకు తీసుకుపోయాడు !

*　　　*　　　*

ఊరంతా చీకటి చీకటి గుంది ! ఆ చిరుచీకటి వేళకే బుగతబాబు బంగ్లాలో లైట్లన్నీ వెలుగుతున్నాయి ! ఆ ఊరి చీకటి మధ్య బుగతబాబు బంగ్లా... చీకటిలో రైల్వే పట్టాలమీద హెడ్ లైట్ వెలుగుతో నిలబడిన డీజిల్ గూడ్సులా వుంది !

బంగ్లాలో బుగతబాబు మనసు చికాకు చికాకుగా వుంది. కూచున్న సోఫాసెట్టు సౌఖ్యంగా లేదు. లేచి పచార్లు కొడ్తున్నాడు. చుట్టూ కుర్చీల మీద నీలకంఠపురం సాహుకారి, గుమ్మ మొఖాసాదారు, మరో సాహుకారి... యిద్దరు మోతుబరి రైతులూ... వీరితోపాటు కర్ణం తిరుపతిరావు పట్నాయక్ వున్నారు.

అందరి మనసుల్లోనా... కరణం మోసుకొచ్చిన గిరిజన సంగం వర్తమానం కల్లోలం రేపింది ! యీ వర్తమానాన్ని పంపిన గురువుమీద అగ్గిలాగ మండిపోతున్నారందరూ !

"అతగాడు కొండ బారిడల మేస్టుర్జోగం సెయ్యడాంకొచ్చాడా ? కొండోల్లకి తిరగబడ్డం నేర్పడం కొచ్చాడా ? ప్రెబుత్వం డబ్బుతిని అతడు సేసిన పనేటి ? సంగాలు పెట్టడంకా గవర్మెంటు జీతం యిత్తంది? అతగాడి ఉద్యోగమేటి ? ఊరుమీద తిరగడమా... పాటలు పాడుకోని, నాటకాలాడుకోని ?'' అని ప్రశ్నలేసాడు మొహం కంద గడ్డలా తయారైన మొఖాసాదారు !

"పాటలు పాడుకోనీ, నాటకాలాడుకోనీ వల్లకుంతన్నాడేటి ? తగువులు, తంటాలు తీర్సడంకి తయారు ! సంగాల జెండా ఎగరెయ్యిడిం ! అన్యాయం చేత్తంద్రో ! అని గోలబెట్టీసి.... దొరికిన సావుకార్లనీ ; రైతు వోరినీ ఆ కొండోల్లచేత తన్నించీడమూ... యిదీ అతగాడి పని !'' అని జడుపు గోక్కుంటూ, కడుపుమంట వెళ్ళగక్కాడు ఓ సాహుకారి !

"యీ కొండ నా కొడుకులికి బయ్యముండొద్దా ? అతగాడు మేస్టుర్జోగం మీదొచ్చాడు. యివ్వాలుంతాడు... రేపోతాడు ? అలాటోడి తోకపట్టుకోని... యీలెన్నాళ్ళీదుతారు ? బయ్యముండొద్దా ?" అని ఓ మోతుబరి రైతు కొండోళ్ళు భయపడాలని కోరుకున్నాడు.

"అతగా డెక్కడికీ ఎలిపోడు ! యీ కొండోలూ అతన్నొదల్రు !

పక్కగా బిడి చెప్పుకుంటూ, యింకో పక్క చిన్న వ్యాపారం చేస్తూవుండీ వోడా ! అలాంటోడు మారిపోయాడు. వ్యాపారం మూస్సాడు. గవర్మెం టోడు అప్పులు రైటాఫ్ జేస్సినట్టుగ.... యీడు బాకీ సాకీలు రద్దుజేస్సి... వొదులుకున్నాడు ! యికంతే ! జాతాపులేటి....సవర్లేటి ఆ కొండోళ్ళంతా యితగాడ్ని దేవుడనుకుంతంఁడు ! గురువు అని పిబుత్తంఁడు. ఆ గురువు మాట వేదవాక్కు పెధవలకి ! వేప మొక్కలాగ వుండేవోడు...అమ్మోరి చెట్టులాగ యేళ్ళదన్నిసాడు..." అని గురువు అనుపానులు తెలిపాడు కర్ణం !

"యేళ్ళతన్నడమేటి.... అన్నిటికీ ఎసర్లు పెట్టీసినాడు కదండీ ? కొండోడు యిన్నాళ్ళలాగ సరుకేదేనా మన కొటాలకి తూకవకిత్తండేటి ? మనకు అమ్ముతండేటి ? ఆ సంగపోలు లేకపోతే... అరోజు సంత మరుండదు. అవుసరాలకు ఆ కొండోలు డబ్బులోడుకుంతే, యిన్నాళ్ళగా కందులు, మినువులు, పెసలో యిలాంటి పంట లేటిత్తన్నారా? గవర్మెంటు వడ్డీ మాటాడతంఁడు ! యిక మన యాపారాలు యేటిలకలుత్తాయి"! అన్నాడో సాహుకారి !

"నీ యాపారాలేనా ?.... మా యవసాయాలేటి సాగుతాయా ? ఎకరం కోతకీ మోతకీ అయిదు రూపాయిలూ, అంబలికింత సోడిపిండీ యిత్తే దండం బెట్టీవోల్లు... అలాంటిది సంగంబెట్టి పాతికదాటి పెంచు కున్నారు. యింకా పెంచాలట ! పాలేరోడి జీతం, కూలోడి కూలిరేటూ అన్నీ పెరిగిపోయి... కళ్ళుగుడ్లు తేలిపోతన్నాయి కాదా..."అని మోతుబరి బాధ !

యిలా గిరిజన సంఘం వచ్చిన తర్వాత మారిన తమ పరిస్థితుల గురించీ, దానిక్కారణమైన ఆ గురువు గురించీ తలా ఓ తీరు మాట్లాడు తుంటే, బుగతబాబు అసలు విషయంలోకి వాళ్ళను తెచ్చేందుకు—

"కళ్ళు తేలిపోవటం కాదోయ్! కళ్ళుపేలిపోతాయ్. కర్నంతెచ్చిన భోగట్టా తెలీవు గావాల నీకు... అడుగు కర్నాన్ని" అన్నాడు.

అప్పుడు కర్నం, బిక్కంతో పొలంవద్ద జరిగిన ఘర్షణా; గిరిజనులు మూకుమ్మడిగా రావటం, తనను గురువు దగ్గరకు తీసుకపోవటం చెప్తూ—

"నీనంతక ముందెప్పుడు సూల్లేదు గురువుని! ఆజాతావు దానింటిల, నులక మంచంల కూచున్నాడు. యేదో రాసుకుంటండు! ఒంటి మీద కంపెనీబాడి వొదులొదులుగుంది... యేటంత బలమయినోడు గాదు... సేరు సితకలుండవు... గురువంతే... యేటో అనుకున్న!"

"ఆడి అందసెందాలెవుడిక్కావాల! అక్కడేటి జరిగిందో, ఆడేటి కబురు పంపాడో చెప్పవోయ్" అని కసురుకున్నాడు బుగత... కర్నం మాటల్ని ఖండిస్తూ.

"అదే....అదేచెప్తున్నాను. నన్నొట్టికెల్లినోలు అతగాడికి చెప్పారు! అప్పుడతను నన్నుచూసి, ఒక్కపాలి మంచం మీంచి గస్‌మని లెగిసి పోనాడు... అతగాడు—అలగ గస్‌మని లెగిస్సరికి....కర్నపోడిని కాదా... నా కాళ్ళు గడగడ వొణికి పోనాయి. బయ్యం కొద్దీ దండం పెట్టాను!... అయినా అతగాడు తగ్గలే! తగ్గకుండా బిక్కంగాడి మడినీ; ఆ మడిలో పంటనీ బుగతబాబూ, నీనూ లాక్కోటం క్షమించరాని దుర్మార్గమన్నాడు! యీ దుర్మార్గాలు సాగినన్నాళ్ళూ సాగిపోయాయి! దోచుకున్నన్నాళ్ళూ యీ అడివి మనుషల రక్తమాంసాలు దోచుకున్నారు! యిప్పుడింక సాగదు- మీ దుర్మార్గాలకు అంత్యకాలమొచ్చింది! మీకు కాలంమూడింది- అని యిలాగ కేకలేసి; ఆఖరికి— యే మడిలోని పంటని బిక్కంగాడికి దక్కకుండా కోయించుకొద్దామనెల్లానో, ఆ మడి పంటని నన్నే కోయమని, కోసి మోయమని, మోసి బిక్కంగాడి కళ్ళంలో కుప్ప వెయ్యమన్నాడు! ....నాజోడు కొంతమందిని పంపాడు..." అని కొద్దిసేపు ఆగాడు కర్నం!

ఆ ఆగిన సమయంలో "అయితేటి నిజింగా, ఆ కొండోడి చేను కోసి మోసావేటి ?" అనుమానంతో అడిగాడు అక్కడి మోతుబరి రైతు !

"మరేటి జేస్తాను... అడివిల దిక్కులేని చావుఛస్తానేటి ! చచ్చి నట్టుగ, ఆల తోటి చేనుకోసి, మోసి కుప్పేసాను. పొద్దు తిరిగిపోయింది ! యికొదిలేస్తారనుకుంతే, మళ్లీ ఆ కొండోలు గురువు దగ్గిరికి తీసి కెల్లారు !

గురువు అప్పటికి చుట్టుపక్కల వలసల సంగమోళ్ళతో కూచు న్నాడు ! అందరూ సమావేశమయి, తీర్మానించుకున్నారట."

"యేమనీ... ?" అడిగాడు ఆత్రుతగా సాహుకారి !

"కండగుత్తల కిందనీ, జిరాయితీ భూములనీ, పట్టాలనీ, చట్టాలనీ- గిరిజన భూముల్ని లాక్కున్నారు పల్లం సాహుకార్లూ... బుగతలూ ! యిలా అడుగడుకూ, అడివి కోల్పోయిన గిరిజనుడు కొండలెక్కి పోడు బతుకుతో మిగిలాడు ! అంచేత, ఈనాడు సంగం ఆ భూములలో పంటల్ని స్వాధీనం చేసుకోవాలని తీర్మానించింది..."

"ఆఁ !"... అన్నారు మోతుబర్లూ, సావుకార్లూ సగంలోనే.

"రేపు లేదు ఎల్లుండి నుండి... యీ కార్యక్రమం ప్రారంభిస్తున్నా మని మీ బుగతబాబుకీ, మీ వర్గం పెద్దలకీ చెప్పు—అని పంపించారు !" అన్నాడు కర్నం !

"ఒసేటాల మెడపోత్రం ! పంటలు కోసీడంకి తయ్యారయి పోతంద్రు ! అయితేటి ? ఆలన్నంతమాత్రాన సెల్లిపోద్దేటి ?" అనడిగాడు మొఖాసాదారు.

"చెల్లకేమవుతాది ! నీ చేలు ఆల యింటి ముంగాలున్నాయి. ఎత్తెల్లి నువ్వీ పల్లం నుండెన్ని సార్లు పూటవుతావు దెబ్బలాటకి... ?" అని కర్నం, ఆ దోతరఫీ చెల్లిపోద్దన్నాడు.

"మనం పూటవడమేల ? కేసులు బెట్టి, జెయిళ్ళ దోయించేత్తే; పోలీసోల కప్పజెప్పేత్తే... ఆటు సూసుకోరా !" అని పోలీసోల్ల అండ గూర్చి ఆశపడ్డాడు సాహుకారి !

"ఆఁ...ఆఁ... సూసుకున్నారు కాదా ! కేసులు గీసులాళ్ళేటి అడ్డీసాయి ? జెయిలు కెల్లినోలు మరింత తెగించేంత్తుంట్రు ! అయినా ఎన్ని మళ్ళకాడకి పోలీసుల్ని కాపలా ఎడతాము ? కోసీ, మోసీ మన కళ్ళాల కుప్పలెయ్యి వాలిసినోలే... కోసుకు దొబ్బుతామంతే మరేటి సెయ్యలేం... పంటలొదులు కోటమే యీ యేడు..." అని నిరాశ పడ్డాడు మరో సాహుకారి !

అప్పుడింకో సాహుకారి "యిదంతా, ఆ 'గురువు' గాడి నుండి వొచ్చిన బాధ కాదా" ? అనడిగాడు.

అప్పుడు బుగతబాబు గొంతెత్తాడు ! అందరూ నిశ్శబ్దమయ్యారు.... అతన్నే వినసాగారు. —

"చూశారు గదా ! ఎక్కడోలు ఎంతకి దిగిపోనారో ! దుర్మార్గానికి దిగిపోనారు ! యీ దుర్మార్గాని కూరుకుంతే...యిది ఊరూరా పాకిపోద్ది... దేశానికి అంటుకుంటాది ! ఎవుడి నౌకరాడు చేసుకోడంకి, ఎవుడి సంపదాడు అనుభవించడంకి గాంధీగారు స్వాతంత్ర్యం తెచ్చారు గానీ... యిలాగ భూములు నాక్కోడంకి, పంటలు కోసీడంకీ, అంతకాలు సెయ్యడానికి కాదు ! అంత దురుమార్గపు తెల్లోల తోటి శాంతంగా దెబ్బలాడాడు గానీ...యీ గురువులా—కొండోల్ని రెచ్చగొట్టినట్లు మన్ని రెచ్చగొట్టీలేదు. దురుమార్గప్పనులికి దింపీలేదు. గాంధీగోరు సెప్తే....దిగనోడెవుడు ? అయితే ఎందుకు సెప్పలేదు ? ఆయన మహాత్ముడు గనక సెప్పలేదు.

అంచేత మహాత్ములు బతికిన నేలమనది. యిక్కడ దురుమార్గు లుండగూడదు. మహాత్ములు తెచ్చిన మంచికి అది ఆ దెంజరు ! దెంజరెలాంటిదో...మనకిప్పుడు బోధపడి పోనాది కాదా...?" అని ఆగారు.

"అవునవును...పడ్డాది" అన్నారంతా !

"అంచేత మంచిని రచ్చించుకోడానికి, మహాత్ముల నేలని నిలబెట్ట డానికి డేంజరుగాళ్ళని మనం చంకలో పెట్టుకుంటే మంచిదేనా?" అడిగారు !

—కాదన్నారు...అంతా !

"కాదుగదా, అయితే డేంజరు అంటే, యేటి ? ఆ డేంజరుగాడు యెవడు ? అని సూడాల మనం" అన్నారు.

"సూసాం కాదా ! కొండోలు....కోతలకి దిగిపోడం డేంజరు ! అందుకాల్లని దింపిన గురువు డేంజరుగాడు" అన్నారంతా...మళ్ళీ.

"ఇదిగో....ఆ డేంజరు లైటార్పియ్యాల" అది మరి ఎలగ కూడదు... అప్పుడంతా చీకటే ! ఆ చీకటిల కొండోడిని నీ యిష్టమొచ్చినట్లు యేటాడుకో మళ్ళీ !" అని చెప్పారు బుగతబాబు.

అంతా అమితానంద భరితులయ్యారు. బుగతబాబుగారి లైటార్పే సిద్ధాంతానికి !

"అయితే, లైటార్పినపుడే డేంజరు జరుగదు గదా మనకి ?" అని అనుమానంతో అడిగాడు ఓ సాహుకారి !

అందుకు బుగతబాబు– "అన్నీ ఆలోచించాను. రేపు మనమొక మనిషిని పంపి: ఆర్ డీవోగారూ, తాశీల్దారుగారూ వొచ్చారు ! సమితాఫీసుల కూచున్నారు ! భూముల విషయం మాట్లాడాలి. మిమ్మల్ని రమ్మన్నారు— అని గురువుకి కబురు పంపుదాం !అతను నిజమే అని బయల్దేరి వస్తాడు ! తోవలో యిటు వల్లాడికీ, అటుఅడవికీ మధ్య .... ఎటూ అందనిచోట మన మనుష్యుల్ని పెట్టి లైటుఆర్పించడమే !" అన్నాడు బుగత !

"గురువు తోటి....మరెవులుండరా ?" కర్నం.

"ఉంటే ఉంటారు ! ఎంతమంది ? ముగ్గురు నలుగురు !– యీడు

సచ్చాన్రో అనిపడిపోతే, యింక కొండోడెవుడు నిలబడతాడు ?" అని మోతుబరి రైతు అందుకు బదులిచ్చాడు !

"వెనకా ముందూ అన్నీచూడు ! అటు ప్లీడర్లనీ, పోలిసోల్నీ గూడా సూసుకోమ్మీ ! నాయకులంతా నీకు చనువే ! యెంత కర్సయినా ఎనకాడకు ... యీ ఊరినీ...దేశాన్నీ రక్షించు....మావాటా ఎంతపడితే అంతా యిస్తాము" అని చెప్పాడు మోతుబరి !

"అన్నీ చూస్తాను.... జాగ్రత్త ! యిది యెక్కడా పొక్కకూడదు" అని చెప్పి, అందరూ ఎంతడబ్బు జమచేయాల్నో, ఎక్కడ మనుషుల్ని కూడబీయాల్నో, ఎలా యీ హత్యా కార్యక్రమాన్ని నిర్వహించాల్నో పూర్తిగా ఆలోచించి, నిర్ణయించుకొని సమావేశం చాలించారు.

గోడలకు చెవులుండవు... గానీ బుగతలకు పాలేర్లుంటారు ! బుగతబాబు దగ్గర పన్జేస్తున్న పాలేరు పుల్లడికి చెవులున్నాయి ! పుల్లడి చెవిలో... యీ హత్యాపథకం పడింది ! ఒక క్షణం పుల్లడి గుండెలు దడదడలాడాయి !

"అమ్మనాయిన ! యీ నంజి కొడుకుల యాపారాలకి, దోపిడీలకి అడ్డొచ్చినాడని... యీ కుట్ర పన్నుతారా ? యీ దుర్మార్గానికి పూనుకుంటారా ? ఆ గురువు చేసిన తప్పేటి ? గురువు వల్లేకదా మా కంబార్ల జీతాలు పెరిగాయి ! కూలోల్ల కూల్లు పెరిగాయి ! మా బతుకులి కింత దారి ఆ గురువే ! అమ్మో ! గురువుని రచ్చించుకోవాల !" అని ఆలోచించి, ఆ రాత్రే ఎవ్వరికీ కనబడకుండా, వలస వెళ్లి.... అక్కడి ముఖ్యులయిన సంగంవారికి... యిక్కడి కుట్ర గూర్చి చెప్పి తిరిగి ఊరొచ్చేసాడు... పాలేరు పుల్లయ్య !

* * *

పాలేరు పుల్లయ్య తెచ్చిన వార్త విన్నతర్వాత, ఆరాత్రే దగ్గర

దగ్గరనున్న వలసల సంగ్గం బాధ్యులా ; ఏజెన్సీ పార్టీ బాధ్యులా, గురువూ.... అంతా సమావేశమయ్యారు. పరిస్థితిని సమీక్షించుకున్నారు.

అంతా సమీక్ష జేస్తూ, ఏజన్సీ కమిటీ పార్టీ బాధ్యుడొకాయన—

"కామ్రేడ్స్! యిదేమీ వింత విషయంకాదు! వాళ్ళు మొదట్నిండీ మనల్ని అణగ దొక్కాలనుకున్నారు. పోలీసు కేసులు పెట్టారు; గూండాల చేత కొట్టించారు! అయినా ఉద్యమం ఆగలేదు! యిక యిప్పుడు పార్టీ ముఖ్యుల్ని చంపేస్తేగానీ లాభం లేదనే నిర్ణయాని కొచ్చారు!

ఉద్యమాన్ని అణచటానికి, ఆరకంగా వారి దోపిడీని నిలుపుకోడానికి వాళ్ళు ఎంతకయినా తెగిస్తారని మన కర్థమవుతోంది!

ఈ యేజన్సీ గ్రామాలన్నిటా మన సంగాలు వెలిసాయి. మనపార్టీ జెండా లెగురుతున్నాయి! ఉద్యమం రోజురోజుకీ పెరుగుతోంది! దీన్ని నిల్పుకోవాలి... మరింత ఉధృతం చేయాలి!

అంచేత, ఇక నుండీ పార్టీ బాధ్యులా, సంగం బాధ్యులా అంతా రహస్య జీవితం గడపాలి! కోర్టులనూ, అధికారుల రాయబారాలనూ బహిష్కరించాలి. ప్రజల్లో రహస్యంగా వుంటూ కార్యక్రమాల్ని కొన సాగించాలి!

ఇందులో భాగంగానే, యీనాటి నుండీ 'గురువూ' మిగతా ముఖ్యులూ రహస్య నిర్మాణానికి వెళ్ళిపోవాలి! మనం పిలుపిచ్చిన పంటల స్వాధీనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి" అని చెప్పాడు!

ఆ కామ్రేడ్ మాటలాపగానే, సోంవు కోపంతో ఊగిపోతూ—

"ఆ బుగత గోడెంత అంతకపోడో, యెంత దురుమారగ పోడో తెలిసింది గదా! ఆడు డబ్బుతోటి, పలుకుబడితోటి మా బతుకులు మాపీసినాడు! మా భూములు లాగేసినాడు!

నూర్రూపాయలప్పుకి... నా జాకరపడి రాయిం చీసుకున్నాడు. ఆ

బుగత తగువుకింద నా పోతుజ్జెత తోలుకు పోనాడు'' అని తనకు జరిగిన అన్యాయాన్ని చెప్పగా,

"మరి, మా వాలస భూములేటయినాయి ! మీ మందరమూ సేరడో...మూరడో భూమితో వుండేవోలిమి ! అలాటిదిప్పుడు మాకెవులికి సెంటుభూమి మిగల్లేదు ఆ బుగతా, సావుకార్లూ వొడీసుకున్నారు ! మా భూంవులమీద...మీమే కూలోలమయిపోయి, చేలుపెంచి...అల గాదెలు నింపుతన్నాము" అన్నాడు వక్క వలస నుండి వచ్చిన మరో సంగం బాధ్యుడు !

అప్పుడు మల్లి సోంవు "ఆ భూములు మావి ఆటిలోని బెడ్డలు మా నెత్తురుగెడ్డలు ! సేలూ...పంట మొక్కలు మా సెవటసుక్కలు ! ఆట్ని యికొదలగూడదు...మా కష్టం...మాకు దక్కాల ! మా భూమి మాకు ఉండాల !" అన్నాడు ఆవేశంగా !

అంతా విన్న గురువు స్థిరంగా "అవును రేపే ప్రారంభం, ఆ బుగత భూమంతా రేపు కోస్సి, పంట స్వాధీనం చేసుకోవాలి. వలస వలసలన్నీ ....తెల్లారే సరికి సిద్ధం చేయాలి ! పదండి...తలా ఓ ప్రాంతం వెళ్ళి సిద్ధం చేద్దాం." అని చెప్పి అంతా విడిపోయారక్కడి నుండి...ఆరాత్రి!

చల్లగా తెల్లవారింది ! కోళ్ళు అరుస్తూ...పెంటకుప్పల్ని దువ్వేస్తూ ఉడకబెడ్తున్నాయి చలికి ! చెట్ల ఆకులు మంచుబిందువులను జలజలా రాల్చుతున్నాయి. అప్పుడప్పుడూ వీచేరెబ్బకొండగాలి...గజగజ వొడికించే స్తోంది ! చలికి గెంటులుకట్టిన గిరిజన్లు 'గెంటులు' విప్పేసారు. కొంటి కర్రలందుకున్నారు ! కొడవళ్ళందుకున్నారు !

'జుంబిరి'ల సోంవు అందరికీ ముందులేచి, ఊరిమొగానున్న రావి చెట్టుమీది జెండాని ఒకచేత పట్టుకొని, మరోచేత దుడ్డుకర్రపట్టి బయల్దేరాడు! బిక్కం వెదురుబాణం, బిలకోలలు పట్టుకొన్నాడు ! బిలకోలలు వదలటంలో బిక్కం గొప్పనేర్పరి !

బిక్కుం భార్య కొంటికర్రందుకుంది కొడవలి భుజాన వేసింది. యిలా జుంబిరి, నీలకంఠాపురం, దగ్గరి దగ్గరి వాలసలన్నీ సాయుధమై... తమ చెమట చుక్కల్తో పెరిగిన పంట ముక్కలను స్వాధీనం చేసుకోడానికి సిద్ధమయినాయి !

బుగత బాబునుండి మనిషొచ్చాడు - గురువుని అర్డీవో రమ్మన్నారని చెప్పటానికి ! గురువు కన్పించలేదతనికి, చుట్టూ ఎటుచూసినా... కొడవళ్ళు, కత్తులూ బాణాలు, కర్రలూ...కేకలు ! వాటి మధ్యలోంచి ముందుకొచ్చి బిక్కుం గొంతెత్తి "ఇదిగో ! మీ బుగతకి చెప్పు ! యీ కొండోలు గొర్రెలు కారనీ, అడుపులీకాడనీ ! యీ కొండలు మండుతున్నాయని చెప్పు. అడివి అంటుకున్నాదని చెప్పు !

యీ కొండల్ల....మాగుండెల్ల...గురువుని దాసుకున్నామనీ, గురువుని సంపటం ఆడికీ, ఆడిజాతికీ వొశింగాదని చెప్పు !

యికబట్టి ఆడిజాతి రాజ్జెంపోనాదనీ మాసంగానిదే రాజ్జెమనీ సెప్పు ! యిదిగో, యిప్పుడే, ఆడు ఆక్రమించుకున్న భూఖండాలమ్మీది పంట కోతకి సిద్దమయినామనీ, దమ్ముంతే కాసుకోమన్నామనీ చెప్పు" అని తిరిగి కబురు చెప్పాడు.

ఆ వ్యక్తి కాలిమడమెత్తి పారిపోయాడు !

దాదాపుగా రెండువేలమంది గిరిజన్లు కదిలారు.

గిరిజన సంగం — అన్నారెవరో

"వర్ధిల్లాలి" ప్రతిధ్వనించాయి గొంతులూ కొండలూ అడవులూ !

★